
సాక్షి ప్రకాశం

గురువారం । 2 । జనవరి । 2025



వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పార్టీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు - 8లో..



అయోమయంలో సంక్షేమ పథకాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా ఎన్నికల వాగ్దానాల అమలుకు నోచుకోలేదు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31/23

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమశాతం అధికంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

5న ఏకసభ్య కమిషన్ జిల్లాకు రాక

- జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు



సమావేశం నిర్వహిస్తున్న డీఆర్‌ఓ చిన ఓబులేసు

ఒంగోలు అర్బన్: షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై అభిప్రాయ సేకరణ కోసం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ ఈ నెల 5వ తేదీ జిల్లాలో పర్యటిస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు తెలిపారు. ఏకసభ్య కమిషన్ పర్యటన సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో డీఆర్‌ఓ సమావేశం నిర్వహించారు. రంజన్ మిశ్రా ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు ఒంగోలు చేరకుంటారని, అనంతరం ఎస్సీ కాలనీల్లో పర్యటిస్తారని తెలిపారు. 6వ తేదీ ప్రకాశంభవనంలో జిల్లా అధికారులతో సమీక్షిస్తారన్నారు. ఆ తర్వాత దళిత, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాలు, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని వివరించారు. ఈ మేరకు శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలను వివిరంచారు. ఉమ్మడి ప్రకాశంలోని దళిత ఉద్యోగుల వివరాలను ఉప కులాలతో సహా గురువారం సాయంత్రం లోగా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారికి అందజేయాలన్నారు. పర్యటనకు సంబంధించి బందోబస్తు, వసతితో పాటు వినతుల స్వీకరణకు ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. పర్యటనపై గ్రామాలో దండోరా వేయించి ప్రజలకు తెలియ చేయాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంధులకు ఆటల పోటీలు

ఒంగోలు వన్‌టౌన్: లూయి బ్రెయిలీ జయంతి సందర్భంగా అంధులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు జి.అర్చన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలలోని అంధులకు ఈ నెల 3వ తేదీన ఒంగోలు సంతపేటలోని డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా ఈ నెల 4న కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో లూయి బ్రెయిలీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన అంధులు కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: రూడ్‌సెట్ సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులు ఉచిత శిక్షణకు అర్హులన్నారు. అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాలకు చెంది 19 నుంచి 45 ఏళ్ల లోపు వయసు ఉన్న వారు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 8309915577 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్జేడీ సుబ్బారావును కలిసిన కాంట్రాక్ట్ లెక్చరర్లు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ విద్యామండలి పరీక్షల నియంత్రణాధికారి, గుంటూరు జోన్ ఆర్జేడీ వీవీ సుబ్బారావును ప్రభుత్వ కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ చైర్మన్ కుమ్మరికుంట సురేష్ ఆధ్వర్యంలో బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని, తమ సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని జేఏసీ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు పి.మాధవరావు, బీవీ కాశీరత్నం, చల్లా శ్రీనివాసరావు, హజరత్తయ్య, గల్లా ప్రభాకర్, తదితరులు ఉన్నారు.



ఆర్జేడీ సుబ్బారావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన జేఏసీ ప్రతినిధులు

క్రీడలకు.. కూటమి చీడ

భావి క్రీడాకారులను తయారు చేయాల్సిన క్రీడా వికాస కేంద్రాలకు పచ్చ గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పచ్చ పార్టీ నేతలు వీటిపై కన్నేశారు. ఒక వైపు వీటిని తన అధీనంలోకి తెచ్చుకుని పెత్తనం చెలాయిస్తూనే..మరో వైపు అనధికారికంగా క్రీడాకారుల దగ్గర నుంచి నగదు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శాప్ అధికారులు, సిబ్బంది తమ ఉద్యోగాలను కాపాడుకునేందుకు వారి సేవలో తరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



- కూటమి నేతల చెరలో ప్లే అండ్ పే క్రీడా వికాస కేంద్రాలు
- చోద్యం చూస్తున్న జిల్లా శాప్ అధికారులు
- ఎంత లీజు ఇస్తే అంత జమ చేసుకొని మౌనం
- నెల నెలా క్రీడాకారుల నుంచి ఫీజులు వసూలు
- జిల్లాలోని నాలుగు కేవీకే సెంటర్లల్లో ఇదే పరిస్థితి

మార్కాపురం టౌన్:

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇండోర్ స్టేడియంల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్లే అండ్ పే విధానంలో అధికారికంగా టెండర్లు పిలిచి నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. అప్పటి నుంచి క్రీడాకారులు నెలకు నగదును చెల్లించి వినియోగించుకుంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిస్థితి మారిపోయింది. కూటమి నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అంతా మా ఇష్టం అంటూ... క్రీడా వికాస కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో బెదిరింపులకు దిగుతున్నారు. అప్పటి వరకూ ఈ కేంద్రాలను నిర్వహిస్తున్న వారికి రాజకీయ రంగు పులిమి వారిపై వేధింపులు ప్రారంభించారు. లీజు రద్దు చేసుకునే వారిపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను చేతుల్లోకి తీసుకొని ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా జేబులు నింపుకుంటున్నారని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు.

అధికారం అడ్డుపెట్టుకొని...

జిల్లాలో మార్కాపురంతో పాటు యర్రగొండపాలెం, సంతనూతలపాడు, ఒంగోలులో క్రీడా వికాస కేంద్రాలు ఉన్నాయి. మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు కూటమి నాయకులు అక్రమ సంపాదనకు ఈ కేంద్రాలపై కుట్రలు మొదలెట్టారు. అక్రమ సంపాదన కోసం క్రీడా వికాస కేంద్రాలను కూడా వాడుకుంటున్నారు కూటమి నాయకులు. మర్కాపురంలోని క్రీడా వికాస కేంద్రం నిర్వహణ బాధ్యత శాప్ అధికారికంగా ఎవరికీ అప్పగించకపోవడంతో అనధికారికంగా కూటమికి చెందిన నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి నేతలు క్రీడాకారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసినా.. శాప్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

మార్కాపురంలో దందా ఇలా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.2 కోట్ల వ్యయంతో ప్లే అండ్ పే పద్ధతిన క్రీడా వికాస కేంద్రాన్ని నిర్మించింది. అప్పటి క్రీడల, టూరిజం శాఖ మంత్రి ఆర్కే రోజా ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. క్రీడా వికాస కేంద్రం నిర్మాణ కాంట్రాక్టర్ బి.వెంకటేశ్వరరెడ్డి టెండర్‌లో దక్కించుకున్నారు. అనంతరం ఇండోర్ స్టేడియం నిర్వహణ బాధ్యతను కె.శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తికి అప్పగించారు. నాడు టెండర్ ద్వారా శాప్‌కు రూ.లక్ష డిపాజిట్ కూడా చెల్లించారు. దీంతో నెల నెల రూ.15,116 లీజు నగదును శాప్‌కు చెల్లిస్తున్నారు. దీంతో పాటు వాచ్‌మెన్, స్వీపర్ జీతాలను చెల్లించడంతో పాటు విద్యుత్ బిల్లులు కూడా చెల్లిస్తున్నారు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో టీడీపీ నేతలు రంగప్రవేశం చేశారు. ముందుగా లీజు పొందిన వ్యక్తిని భయపెట్టి లీజును రద్దు చేసుకునే విధంగా ఒత్తిడి తెచ్చారు. దీంతో చేసేది లేక లీజు రద్దు చేసుకుంటున్నట్లు శాప్ ఎండీకి లేఖ పంపారు. రూ.లక్ష డిపాజిట్ కూడా ఇవ్వాలని కోరారు. క్రీడా వికాస కేంద్రం తాళాలు కూడా అధికారులకు అప్పగించారు. అప్పటి నుంచి కూటమి ప్రభుత్వ నేతలు ఎలాంటి అనుమతులు లేకుండా క్రీడా వికాస కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. క్రీడాకారుల నుంచి నెలకు రూ.600 వంతున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులకు ఈ అక్రమ వసూళ్ల విషయం తెలిసినా పట్టించుకోకపోవడం వారి స్వామి భక్తిని చాటుకుంటున్నట్లు పలువురు క్రీడాకారులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వానికి ఆదాయం రాకపోగా మెయింటెనెన్స్ ఇబ్బందులు, క్రీడాకారులకు ఆటలపై ఆసక్తిని కోల్పోయే పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మార్కాపురంలో క్రీడా వికాస కేంద్రం



క్రీడా వికాస కేంద్రం వద్ద ఖాసింసాహెబ్ పేరుతో ఉన్న క్యూఆర్ కోడ్

> **పర్యవేక్షణ మాత్రమే చూస్తున్నారు**
>
> జిల్లాలో నాలుగు నియోజకవర్గాలలో క్రీడా వికాస కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం నిర్వహణ కోసం ఎవరు లేకపోవడంతో కొంత మందికి పర్యవేక్షించాలని చెప్పాం. అంతే కానీ నగదు లావాదేవీలు అన్నీ ప్రభుత్వ ఆధీనంలో జరుగుతున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలో కేంద్రాల నిర్వహణ కోసం టెండర్లు పిలుస్తాం. టెండర్‌లో దక్కించుకున్న వారు క్రీడాకారులకు తగిన ఏర్పాట్లు చేసి ఆటలు ఆడుకునే విధంగా చూస్తారు.
>
> **– రాజేశ్వరి, డీఎస్‌డీఓ, ఒంగోలు**

ప్రజలను మోసం చేయడమే విజన్

- కూటమి నేతలకు తెలిసింది శూన్యం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



యర్రగొండపాలెం: ప్రజలను మోసం చేయడమే కూటమి నేతల విజన్ అని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇస్తామన్న పెట్టుబడులు ఎగొట్టడంతో పాటు పంటలకు తగిన మద్దతు ధర కల్పించడంలో బాబు ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు ప్రజలకు ఏ విధంగా మోసం చేయాలన్న విషపూరితమైన విజన్ తప్ప ఏం తెలియదని వ్యగ్యంగా అన్నారు. పేదలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలకు తిలోదకాలు పలికిన చంద్రబాబు దేశంలో అత్యంత సంపన్నుడిగా ఎదిగాడని, అధికారికంగా రూ.931 కోట్లు, అనధికారికంగా లక్షల కోట్లు ప్రభుత్వ ధనాన్ని, ప్రజల కష్టార్జితాన్ని దోచుకున్నాడని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్న ప్రతిసారి పేదలను మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలకు తీవ్ర అన్యాయం చేశాడన్నారు. అధికారంలో లేని సమయంలో బాబు చెప్పే విజనరీ లెక్కలు, సంపద సృష్టి లాంటి సూత్రాలు అధికారంలోకి వచ్చిన తరువాత ఏం కనబడవన్నారు. ఇప్పటికైనా.. చంద్రబాబు విషపూరిత రాజకీయాలను మాని ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయాలని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్లలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, అన్ని వర్గాల ప్రజల కోసం పథకాలు ప్రవేశపెట్టి ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ కాలంలో ఎటువంటి ప్రభుత్వ పథకాలు అందుకోలేక పండుగల సమయంలో కూడా పేదలు కడుపు ఎండగట్టుకునే పరిస్థితికి తీసుకువచ్చారని మండిపడ్డారు. నూతన సంవత్సరంలో ప్రజలు ఆనందంగా గడపాలంటే తక్షణం ఆరు హామీలను అమలు చేయాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, నిర్మాణ రంగానికి ఆయువు పట్టు అయిన ఉచిత ఇసుకను ఇప్పించాలని, విద్యుత్ ట్రూ అప్ చార్జీలు మాఫీ చేయాలని, ప్రజలను లూటీ చేసే జన్మభూమి కమిటీలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్ సీపీ పోరాటాలు చేయాల్సి వస్తుందని తాటిపర్తి హెచ్చరించారు.

నవ వసంతరాగం..



ఒంగోలు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, చుండూరి రవిబాబు, ఇతర నేతలు



కేక్‌ను అన్నా రాంబాబుకు తినిపిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్ధ రాత్రి నుంచే యువత సందడి చేశారు. కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో నాయకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథులుగా హాజరై నూతన సంవత్సర కేక్ కట్ చేశారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో కార్యాలయం కిక్కిరిసింది. నాయకులు, కార్యకర్తలు బొకేలు, పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, లిడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, ఇతర నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

➤ మార్కాపురంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా 700 కేజీల భారీ కేక్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కట్ చేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

➤ దర్శిలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలకు శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి తరలివచ్చిన నేతలు, అభిమానులతో దర్శి జనసంద్రంలా మారింది. ఈ సందర్భంగా కార్యకర్తలు జై జగన్..జై బూచేపల్లి అంటూ కార్యాలయ ఆవరణ మార్మోగింది.

➤ యర్రగొండపాలెంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నివాసం వద్ద కోలాహలం నెలకొంది. నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివచ్చి బొకేలు, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎమ్మెల్యే తాటిపర్తి అందరినీ ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన అభిమానులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎమ్మెల్యే చంద్రశేఖర్ భోజన ఏర్పాట్లు చేశారు.

➤ గిద్దలూరులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు పార్టీ కార్యాలయానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

➤ కనిగిరిలో పార్టీ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ పాల్గొన్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నడుమ భారీ కేక్‌ను కట్ చేశారు. పెద్ద ఎత్తున అభిమానులు తరలిరావడంతో కార్యాలయ ఆవరణ కిక్కిరిసింది.

➤ సింగరాయకొండలో పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచ చేసిన నూతన సంవత్సర వేడుకల్లో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. సురేష్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు.

➤ చీమకుర్తిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలకు శుభాకాంక్షలు తెలిపేందుకు నేతలు, కార్యకర్తలు పోటీ పడ్డారు. తొలుత బూచేపల్లికమలాకర్ పార్కులో కేక్ కట్ చేసి పంచిపెట్టారు.



యర్రగొండపాలెంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

‘మద్యం తాగొచ్చి తిడుతున్నాడు’

- ఈఈ మాకొద్దు బాబోయ్..
- ధర్నాకు దిగిన వెలిగొండ ప్రాజెక్టు కార్యాలయ సిబ్బంది

బేస్తవారిపేట: వెలిగొండ ప్రాజెక్ట్ ఈఈ టి.వెంకటరమణయ్య నిత్యం మద్యం సేవించి తిడుతున్నాడని కార్యాలయ సిబ్బంది ధర్నాకు దిగారు. ఈ సంఘటన బుధవారం చింతలపాలెం సమీపంలోని వెలిగొండ ప్రాజెక్ట్ కార్యాలయంలో జరిగింది. ఈఈ వెంకట రమణ మద్యం తాగి విధులకు హాజవుతున్నాడని, కార్యాలయ సిబ్బందిని నోటికొచ్చినట్లు తిడుతున్నాడని వాపోయారు. కొంత మంది సిబ్బంది కార్యాలయానికి రాకున్నా డబ్బులు తీసుకొని హాజరు వేసి జీతం చెల్లిస్తున్నారని, అద్దె వాహనాలకు అగ్రిమెంట్ చేయకుండా లంచం అడుగుతున్నాడని, బిల్లు చేసేటప్పుడు సగం ఇస్తేనే బిల్లులపై సంతకం పెడతానని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని మండిపడ్డారు. మూడు నెలలుగా కార్యాలయ గెస్ట్‌హౌస్ మూత వేస్తున్నట్లు మెమో ఇచ్చారని, కానీ ఆయన మాత్రం తాగేందుకు, రెస్ట్ తీసుకునేందుకు ఉపయోగించుకుంటున్నాడని తెలిపారు. కార్యాలయంలో టీ, వాటర్ బాటిళ్ల అన్నీ సిబ్బంది పెట్టుకోవాల్సి వస్తుందని, కార్యాలయానికి అవసరమైన స్టేషనరీ ఒక్కడి తేవడం లేదన్నారు. విధుల్లో చేరి ఏడు నెలలవుతున్నా డీఈలు, ఏఈలతో ఒక్క మీటింగ్ పెట్టలేదని, ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నా ఫీల్డ్ విజిట్ చేయలేదన్నారు. మేం ప్రాజెక్టు వద్దకు వెళ్తే ఎక్కడికి వెళ్లారని అసహ్యంగా తిడుతున్నాడని, అవహేళనగా మాట్లాడుతూ హీనంగా చూడటంపై ప్రాజెక్ట్ డీఈలు, ఏఈలు, కార్యాలయ సిబ్బంది గెస్ట్‌హౌస్ వద్ద ఈఈని నిలదీశారు. సిబ్బంది మూకుమ్మడిగా ప్రశ్నించడంతో సమాధానం చెప్పకుండా బయటకు వెళ్లిపోయారు. కార్యక్రమంలో డీఈలు, ఏఈలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఈఈని నిలదీస్తున్న డీఈలు, ఏఈలు



ధర్నా చేస్తున్న అధికారులు, కార్యాలయ సిబ్బంది



సమాధానం చెప్పకుండా పారిపోతుండటంతో అడ్డుకుంటున్న సిబ్బంది

నేతలకు శుభాకాంక్షల వెల్లువ



మార్కాపురంలో కేక్ కట్ చేస్తున్న చెవిరెడ్డి, అన్నా రాంబాబు

నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల వద్దకు బుధవారం ప్రజలు బారులు తీరారు. తమ అభిమాన నేతలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. నాయకులను శాలువాలతో సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



దర్శిలో భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, నందిని



యర్రగొండపాలెంలో ఎమ్మెల్యే తాటిపర్తికి శుభాకాంక్షలు చెబుతున్న వైఎస్సార్ సీపీ అభిమానులు



సింగరాయకొండలో డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు శుభాకాంక్షలు చెబుతున్న డాక్టర్ వెంకయ్య, డాక్టర్ అశోక్



కనిగిరిలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణకు బొకే అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



గిద్దలూరులో కేపీ నాగార్జునరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



ఒంగోలులో ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మ, చుండూరిలకు గజమాలతో సత్కారం



భారతి సిమెంట్ ముద్రించిన క్యాలెండర్‌లను ఒంగోలులో ఆవిష్కరిస్తున్న పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి, వెంకాయమ్మ, చుండూరి రవిబాబు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ మంత్రి సురేష్ ఆధ్వర్యంలో అంబరాన్నంటిన నూతన సంవత్సర వేడుకలు

సింగరాయకొండ: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలుపు ఇచ్చారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకల్లో మాట్లాడారు. పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావులేదన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా పేద ప్రజలకు మొండిచేయి చూపిస్తోందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు చేసే మోసాలను ప్రజలకు తెలియజేసేందుకు పార్టీ చేసే ఉద్యమాల్లో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. తాను ఎల్లప్పుడు నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు సురేష్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు కప్పారు. పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, పార్టీ వైద్య విభాగం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు పుట్టా వెంకట్రావు, యన్నాబత్తిన చిన్నా, మసనం వెంకట్రావు, షేక్ పటేల్, షేక్ కరీం, పఠాన్ రియాజ్, షేక్ ఆబిద్ అలీ, సోమిశెట్టి సురేష్, గాదంశెట్టి గుప్తా, జెట్టి జానకిరామిరెడ్డి, గాలి బుజ్జి, శేషయ్య, సాయికోటి, చిమటశ్రీను, మాదాల శంకర్, అడకా శ్రీరాములు, రావినూతల అంకయ్య, పంతగాని నరశింహారావు, మలినేని వెంకటేశ్వర్లు, చిడిపూడి కృష్ణారెడ్డి, శ్రీహరిరెడ్డి, కేశవరపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ గోళ్లమూడి అశోక్‌రెడ్డి, బల్లెల ప్రభాకరరెడ్డి, వాయిల తాతయ్య, వాయిల పున్నయ్య, గొల్లపోతు గోవర్ధన్, కాళహస్తి వెంకారెడ్డి, పురిణి దేవ, రావూరి ప్రభావతి, యనమల మాధవి, బుజ్జమ్మ, చుక్కా కిరణ్‌కుమార్, మాలె రంగారెడ్డి, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్లా, పీపీ రెడ్డి, పాకనాటి రమణారెడ్డి, చొప్పర వెంకన్న, చొప్పర శివ, జరుగుమల్లి మండల కన్వీనర్ బత్తిన మదన మనోహర్, పిన్నిక శ్రీనివాసులు, దుంపా అనిల్‌కుమార్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు, దగ్గుమాటి శ్రీనివాసరావు, దగ్గుమాటి శంకరరెడ్డి, నాగినేని భాస్కర్, పాలేటి రవి, చుండూరి సురేష్, కొమ్మాలపాటి మధు, కాకి జయపాల్, చింతపల్లి హరిబాబు, ఎంపీపీ వెంకటరెడ్డి, భోదా రమణారెడ్డి, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, పల్లపోతు బాలకోటిరెడ్డి, పల్నాటి వెంకటేశ్వర రెడ్డి, మండవ మాలకొండయ్య, వసంత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సింగరాయకొండ: పార్టీ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్


అయోమయంలో సంక్షేమ పథకాలు

- ఎన్నికల ముందు మూతబడిన వెబ్‌సైట్లు
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- నేటికీ తెరుచుకోక పోవడంతో ఆందోళన

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా ఎన్నికల వాగ్దానాల అమలుకు నోచుకోలేదు. సంక్షేమ పథకాలు, పౌర సేవలకు సంబంధించిన వెబ్‌సైట్లను ఇంకా తెరవకుండా బ్లాక్‌లోనే ఉంచింది. ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేయకుండా కాలయాపన చేస్తుండటంతో ప్రజలు ఎదురు చూపులు చూడాల్సి వస్తోంది. పలు సేవలు, పథకాల అబ్ధి అందక అవస్థలు పడుతున్నారు.

అందని పెళ్లికానుక

పేద వర్గాల వారి వివాహ వేడుకకు పెళ్లి కానుక ద్వారా ప్రభుత్వం సాయం అందించేది. బీసీ సామాజిక వర్గం వారికి వివాహ కానుకగా రూ.50 వేలు, వధూవరుల్లో ఎవరికైనా వైకల్యం ఉంటే రూ.75 వేలు, ఎస్సీ సామాజిక వర్గం వారికి రూ.లక్ష, ఎవరికైనా వైకల్యం ఉంటే రూ.1.5 లక్షలు, బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారు కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.2 లక్షలు సాయంగా అందించేది. ఇప్పుడు ఆ సైట్ ఓపెన్ కాకపోవడంతో దరఖాస్తు చేసుకునే వీల్లేక ఆయా వర్గాలకు సాయం అందడం లేదు.



పని చేయని సంక్షేమ పథకాల వెబ్‌సైట్

బీమాకు దిక్కులేదు

సాధారణ, ప్రమాద రూపంలో ఇంటి యజమానిని కోల్పోయిన కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా గత ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. సాధారణ మరణం అయితే రూ.లక్ష, ప్రమాద బీమా అయితే రూ.5 లక్షలు సాయం అందించేది. మట్టి ఖర్చుల కోసం తక్షణ సాయంగా రూ.10 వేలు అందించేవారు. ఈ పథకం పాలసీ గడువు జూన్ 31తో ముగిసిపోయింది. సాధారణ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ.10 లక్షల బీమా సాయం అందిస్తామని గతంలో హామీలు ఇచ్చిన కూటమి నాయకులు.. ఇంకా సైట్ కూడా ఓపెన్ చేయలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా అనేక బాధిత కుటుంబాలు సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

హెల్త్ కార్డులు దూరం

అత్యవసర వైద్యసేవల సమయంలో పేద వర్గాల వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డులు ఎంతో భరోసానిచ్చేవి. సాంకేతికపరమైన ఇబ్బందులు ఎదురైనా వెంటనే సరిచేసి వైద్యసేవలు అందించేందుకు వీలుండేది. ప్రస్తుతం ఈ సైట్‌లోని పలు ఆప్షన్లు ఇంకా క్లోజ్‌లోనే ఉండటంతో వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

రేషన్ కార్డులు ఎప్పుడో

బియ్యం కార్డులకు సంబంధించి సైట్ ఓపెన్ కాక కొత్తకార్డుల మంజూరు, పుట్టిన పిల్లలను కార్డులో చేర్చడం, చనిపోయినవారి పేర్లు తొలగింపు ప్రక్రియ నిలిచిపోయింది. అక్షర దోషాలకు సంబంధించి కరెక్షన్లు కావడం లేదు. కేవలం వలస కార్మికుల దరఖాస్తులు మాత్రమే అప్‌లోడ్ చేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు మృతి

నూతన సంవత్సరం రోజు బుధవారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వేర్వేరు ఘటనల్లో మొత్తం ఆరుగురు మృతి చెందారు. ఆ ఘటనలు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపాయి.

రైలు ప్రమాదంలో యువకుడి మృతి

సింగరాయకొండ: వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు గుర్తు తెలియని యువకుడు (35) జారిపడి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం తెల్లవారు జామున మండల పరిధిలోని సోమరాజుపల్లి రైల్వేగేటు సమీపంలో జరిగినట్లు రైల్వే జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. కావలి వైపు వెళ్తున్న రైలు నుంచి యువకుడు జారి పడ్డాడని, అతడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఒంటిపై పసుపు రంగు చొక్కా, నల్ల ప్యాంటు, బాస్ అక్షరాలు ఉన్న కాఫీ రంగు డ్రాయర్ ఉన్నాయి. ఛాతిపై రామ్ కాసిం అని, కుడిచేతిపై డమరకం ఉన్న త్రిశూలం, ఎడమచేతి మీద మామ్ డాడీ అని పచ్చబొట్లు ఉన్నాయని తెలిపారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు 9440627647 నంబర్‌కు సమాచారం అందిచాలని ఒంగోలు జీఆర్‌పీ ఎస్సై అరుణకుమారి వివరించారు.

మరో యువకుడు కూడా..

టంగుటూరు: రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలు–సూరారెడ్డిపాలెం రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు– సూరారెడ్డిపాలెం రైల్వే స్టేషన్ల మధ్య ఎగువ లైన్లో వెళ్తున్న గుర్తు తెలియని ట్రైన్ నుంచి గుర్తుతెలియని యువకుడు సుమారు (30) జారిపడి మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ముదురు గులాబీ రంగు చొక్కా, బ్లూ జీన్స్ ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై ఎస్ఎస్ పచ్చబొట్టు ఉంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై అరుణకుమారి తెలిపారు. వివరాలకు 94406 27647 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



గుర్తుతెలియని మృతదేహం

రెండు బైకులుఢీ.. ఒకరు మృతి

అద్దంకి: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నాగులపాడు రోడ్డులో బుధవారం తెల్లవారు జామున జరిగింది. అందిన సమాచారం మేరకు.. నాగులపాడు గ్రామానికి చెందిన బాపయ్య చౌదరి బైక్‌పై అద్దంకి నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. అద్దంకిలోని గరటయ్య కాలనీకి చెందిన బిక్కి అజయ్ (40) బైక్‌పై నాగులపాడు వైపు నుంచి అద్దంకికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఇరువురు బైకులు గ్రామంలోని ఎస్సీ శ్మశానం వాటిక ఎదురురెదురుగా ఢీకొట్టుకున్నారు. ప్రమాదంలో అజయ్‌కు తీవ్రగాయాలు అవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన బాపయ్యను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. మృతుడు అజయ్ కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

సంతమాగులూరు (అద్దంకి): స్నేహితుల ఇంట్లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొని వస్తుండగా బైకును లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సంతమాగులూరు మండలం పాతమాగులూరు సమీపంలోని లక్ష్మీపురం సమీపంలో బుధవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. పాతమాగులూరు గ్రామానికి చెందిన ఉన్నం బ్రహ్మేశ్వరరావు (45) నరసరావుపేటలోని నూతన సంవత్సరం వేడుకల్లో మిత్రులతో కలిసి పాల్గొని గ్రామానికి తిరుగుప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో పాతమాగులూరు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో కిందపడి తీవ్రంగా గాయపడిన బ్రహ్మహ్మేరావును స్థానికుల సమాచారం మేరకు 108 వాహనానికి సమాచారం అందించాడు. క్షతగాత్రుడిని నరసరావుపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మార్కులు తక్కువగా వస్తున్నాయని బాలిక ఆత్మహత్య

ఒంగోలు టౌన్: నగరానికి చెందిన ఒక బాలిక పదో తరగతిలో మార్కులు తక్కువగా వస్తున్నాయని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని మారుతీ నగర్‌కు చెందిన బాలిక ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుకుంటోంది. ఎంత చదివినా మార్కులు సరిగా రావడం లేదని బాధపడేది. నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తీసుకుంది. దీంతో తలిదండ్రులు ఆ బాలికను వెంటనే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఆమెను గుంటూరు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం బాలిక మృతి చెందింది. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

బేస్తవారిపేట: మండలంలోని పీవీ పురంలో అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పీవీ పురానికి చెందిన మీనిగ సుబ్బలక్ష్మమ్మ (72) సోమవారం ఉదయం రేగిపండ్ల కోసం ఇంటి నుంచి వెళ్లింది. రాత్రికి ఇంటికి రాక పోవడంతో గ్రామంలోనే ఉంటున్న కుమారుడు వెతికాడు. మంగళవారం రాత్రి పీవీ పురంలో మృతురాలి ఇంటికి సమీపంలోని పేడదిబ్బలో మృతదేహం ఉండటాన్ని గ్రామస్తులు గమనించారు. సుబ్బలక్ష్మమ్మ చేతులు, కాళ్లు, పొట్టపై విద్యుత్‌ఘాతం గాయాలు ఉన్నాయి. మృతురాలి భర్త పెద్ద పోలయ్య ఆరు నెలల క్రితమే మృతి చెందాడు. రేగిపండ్ల కోసం కొండ ప్రాంతాల్లోకి వెళ్లే సమయంలో పొలంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెంది ఉంటుందని, పొలం వాళ్లు గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళలో మృతదేహాన్ని గ్రామంలోనే పడేసి వెళ్లి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

షాపు యజమాని నిజాయితీ



జయరావుకు ఉంగరం అందజేస్తున్న షాపు యజమాని

మార్కాపురం టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న ఎస్ఎస్ కాంప్లెక్సులోని మహేష్‌కు చెందిన నిత్యావసర సరుకుల దుకాణంలో సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఆర్‌అండ్‌బీ రిటైర్డు సూపరింటెండెంట్ పులుకూరి జయరావు తన చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని పొరపాటున జారవిడుచుకున్నాడు. ఇంటికి వెళ్లి తన ఉంగరం పోయిన విషయాన్ని గమనించి షాపునకు వెళ్లి యజమాని మహేష్‌కు తెలిపాడు. గమనించిన షాపు యజమాని మహేష్ 4 రోజుల తర్వాత షాపులోని వస్తువులు సర్దుతుండగా బంగారు ఉంగరం కనిపించడంతో పోగొట్టుకున్న వ్యక్తిని గుర్తించి సమాచారం తెలిపి అందచేసి అతని నిజాయితీని చాటుకున్నాడు. ఉంగరం తిరిగి ఇచ్చి తన నిజాయితీని చాటుకున్న యజమాని మహేష్‌ను పలువురు అభినందించారు.